క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న సేవాసమితి సభ్యులు

డోన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కోట్రికె వెంకటశెట్టి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వివేకానంద సేవాసమితి సభ్యులు శనివారం సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన విజయలక్ష్మి 590, శశికళ 587, మౌనిక 578, హారిక 574, జస్విత (557)లకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీను, వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్మోహన్, సభ్యులు కుళ్లాయప్ప, శ్రీధర్‌భట్, ఎల్లూరు నరేష్, సర్వజ్ఞ మూర్తి, గంగిరెడ్డి, కొత్తపల్లె శ్రీను, గంగిశెట్టి రమణయ్య, హెచ్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

చేపలు మృత్యువాత



ఆకుమల్ల గ్రామంలో ఉన్న ఎస్సార్‌బీసీ కాల్వలో మృతి చెందిన చేప పిల్లలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల ప్రాధాన ఎస్సార్‌బీసీ కాల్వకు నీరు నిలిచిపోవడంతో కాల్వలో ఉన్న చేప పిల్లలు మృతి చెందాయి. అవుకు రిజర్వాయర్ నుంచి అనుసంధానం ఉన్న ఎస్సార్‌బీసీ కాల్వల నుంచి దిగువకు వచ్చే నీటిలో చేపలు వస్తూంటాయి. ఒక్కసారిగా నీరు నిలిచిపోవడంతో ఒకవైపు నీరు అందక, మరోవైపు తీవ్రమైన ఎండలకు చేపలు మృత్యువాత పడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని మలుపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో బస్సు తాడిపత్రి నుంచి వస్తోంది. ఇదే సమయంలో కనకాద్రిపల్లెకు చెందిన ప్రసాద్ కుటుంబ సభ్యులు బొలెరోలో అహోబిలంలో స్వామి దర్శనానికి వెళ్లి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని కస్తూర్బా పాఠశాల మలుపు వద్దకు ఆర్టీసీ బస్సు, బొలెరో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరోలోని విజయ్, సుబ్బరాయుడు, నందిని స్వల్పగాయాలతో బయటపడగా ప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. క్షతగాత్రులను 108లో తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గేట్‌మన్‌పై దాడి

డోన్‌టౌన్: పట్టణంలోని పాతపేట రామాలయం వద్ద రైల్వే గేట్‌మన్ టి.వెంకటేశ్వర్లుపై పట్టణానికి చెందిన పవన్ అనే న్యాయవాది దాడి చేసి గాయపరిచినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఉదయం గేటు వేసే సమయంలో అటుగా వాహనంపై వెళుతున్న పవన్ గేట్‌మన్‌తో వెహికల్ వస్తుంటే కనబడడం లేదా అంటూ వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడడంతో రైల్వే ఉద్యోగి తలకు గాయమైనట్లు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం శక్తియాప్‌పై ఆ విభాగం ఏఎస్‌ఐ నాగరాజు అవగాహన కల్పించారు. యాప్‌తోపాటు సైబర్ నేరాలు, 100, 112, బాల్య వివాహాలు, మహిళా చట్టాలను తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు వీడియోకాల్స్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతూ మోసం చేస్తున్నారన్నారు. బ్యాంకు ఖాతా, ఓటీపీ, తదితర వివరాలు తెలుపకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు



సారా, నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా విక్రయ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి శనివారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సమీపంలో కల్వటాల గ్రామానికి చెందిన సూర్యనారాయణ నుంచి 500 నాటుసారా ప్యాకెట్లు, అలాగే అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన మెట్ట దస్తగిరమ్మ నుంచి 500 ప్యాకెట్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ కమలాకర్ పాల్గొన్నారు.

పల్లెల్లో క్రీడా సంబరం

- తిరునాల, జాతర వచ్చిందంటే పోటీల సందడి
- బండలాగుడు, కబడ్డీ పోటీలకు ప్రాధాన్యం
- విజేతలకు భారీగా నగదు ప్రోత్సాహకాలు
- గ్రామాల్లో విస్తరిస్తున్న పోటీల సంస్కృతి



బేతంచెర్లలో బండలాగుడు పోటీలు (ఫైల్)



హోరాహోరీగా తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

బేతంచెర్ల: గ్రామాల్లో క్రీడా సందడి నెలకొంది. వేసవిలో గ్రామాల్లో జాతరలు, దేవరలు జరుగుతుండడంతో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎద్దుల బండలాగుడు, కబడ్డీ పోటీలు హోరాహోరాగా సాగుతున్నాయి. వీటిని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాలు, ప్రాంతాల నుంచి జనం అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. జనంతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకొచ్చి నగదు బహుమతులు అందజేస్తున్నారు.

జాతర అంటే పోటీలు ఉండాల్సిందే

జిల్లాలోని ప్రముఖ శైవ, వైష్ణవ పుణ్యక్షేత్రాల్లో ఆయా పండుగలు, తిరునాలు జరిగేటప్పుడు ఉత్సవాలకు హాజరైన వారికి కొత్త ఉత్సాహాన్ని నింపాలనే ఉద్దేశంతో నిర్వాహకులు వృషభాల బండలాగుడు పోటీలను నిర్వహించేవారు. ప్రస్తుతం పుణ్యక్షేత్రాలతోపాటు ఆ సంస్కృతి మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ అనుసరిస్తున్నారు. బేతంచెర్లలో వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలోని చౌడేశ్వరిదేవి, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలోని పారిశ్రామిక వేత్తలు, రైతు సంఘం నాయకుల సహకారంతో రాష్ట్రస్థాయి బండలాగుడు, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం, రహీమానుపురం, హెచ్‌కొట్టాల, ముద్దవరం, ఆర్‌బుక్కాపురం గ్రామాల్లో జిల్లా స్థాయి బండలాగుడు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు.

పెరిగిన ప్రోత్సాహక బహుమతులు

గతంలో వృషభాల బండలాగుడు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.30 వేల నుంచి రూ.50 వేలకు మించేవికావు. దాతల సహకారంతో ప్రస్తుతం రూ.లక్షన్నర వరకు అందజేస్తున్నారు. ఒకటి నుంచి ఐదో స్థానం వరకు విజేతలకు నగదు బహుమతులు ఇస్తున్నారు. బేతంచెర్ల మండలంలోని ముద్దవరం, హుసేనాపురం, శంకలాపురం, ఆర్ బుక్కాపురం, ముసలాయిచెర్వు గ్రామాల్లో కొంతమంది రైతులు బండలాగుడు పోటీల కోసమే వృషభాలకు శిక్షణ ఇస్తున్నారు. ఇక ఆర్ బుక్కాపురం, నాగమళ్లకుంట, ఆర్‌ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, శంకలాపురం, యంబాయి గ్రామాల్లో కబడ్డీ ఆటగాళ్లు ఉన్నాయి. ఎక్కడ పోటీలు జరిగినా ఉత్సాహంగా పాల్గొంటూ సత్తా చాటుతున్నారు.

గ్రామంలో సందడే సందడి



బేతంచెర్లలో జరిగే జాతరలు, ఉత్సవాల సందర్భంగా నిర్వహించే బండలాగుడు పోటీలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. బండలాగుడు పోటీలకు 10 నుంచి 15 జతల వృషభాలు పాల్గొంటుంటాయి. పోటీల వల్ల పట్టణాలు, గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. –చలం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్

ఉత్సాహం నింపాలనే ఉద్దేశంతోనే..



బేతంచెర్లలో చెన్నకేశవస్వామి, చౌడేశ్వరీదేవి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఆయా ఉత్సవాల కోసం గ్రామాలకు వచ్చే బంధుమిత్రుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలనే ఉద్దేశంతో ఎద్దుల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నాం. వీటి నిర్వహణ కోసం పారిశ్రామికవేత్తలు, రైతు సంఘం నాయకులు తోడ్పాటు అందిస్తున్నారు. –హుస్సేన్‌రెడ్డి, చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ సభ్యుడు

పోటీలతో స్నేహభావం



గ్రామీణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రంలో నిర్వహించే బండలాగుడు పోటీలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని సంజీవనగర్‌లో కబడ్డీ, గుండు, చంద పోటీలను నిర్వహిస్తున్నాం. నిర్వహణకు దాతల సహకారం ఎంతో ఉంది. ఏడాదికేడాది పోటీల్లో పాల్గొనే జట్లు, నగదు బహుమతులు పెరుగుతున్నాయి. – గూని నాగ రాజు, బేతంచెర్ల

స్వామివారి సేవలో కాటసాని సోదరులు



స్వామివారిని దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి, రామిరెడ్డి

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకున్నారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం స్థానికులతో మాట్లాడారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ అవుకు కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, మూరం నర్సిరెడ్డి, క్రిష్టారెడ్డి, కొడితం విక్రమ్, గోపాజి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అవుకు: పట్టణంలోని భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి నుంచే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు సంపత్ శర్మ, అర్చకులు రమణయ్య, మురళీ, పెరుమల సత్యం ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ త్రయోదశి, చిత్తా నక్షత్రం మిధున లగ్నంలో ఉదయం 8 నుంచి 8.45 గంటల మధ్య స్వామివారి కల్యాణం జరిగింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కంబగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కంబగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



తిలకిస్తున్న భక్తులు

సంజామల: పేరుసోముల గ్రామంలో కంబగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. ముందుగా యాగశాల ప్రవేశం, చతుస్థానార్చనం, సుదర్శన, ధన్వంతరి, వివిధ హోమాలు నిర్వహించారు.అనంతరం ఆదిలక్ష్మిసిద్ధలక్ష్మి సమేత కంబగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళా విభాగంలో మొత్తం 12 టీమ్‌లు, పురుష విభాగంలో 27 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మురళీనాయక్‌కు నివాళి

డోన్ టౌన్: పాకిస్తాన్ సైన్యం కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి శనివారం శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్స్ ఎడ్యూకేషన్ అకాడమీ అధినేత లక్ష్మణసాయి, విద్యార్థులు నివాళులర్పించారు. సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొలిమిగుండ్ల: గురువులతో పూర్వ విద్యార్థులు

కొలిమిగుండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత అందరూ ఒకచోట కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. 72 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఈస్థాయిలో ఉండటానికి కారణమైన గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

అపూర్వ కలయిక



బేతంచెర్ల: శేషారెడ్డి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డ్ హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు రామశర్మ, నాగభూషణం, మహమ్మద్ హనీఫ్, తిరుపాలును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, నరసింహనాయుడు, విజయ్, హుసేన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

బేతంచెర్ల: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభయ్యే ఈ శిబిరంలో ఎవరైనా స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చన్నారు.

మంత్రి దృష్టికి తాగునీటి సమస్య

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్తులు మంత్రి బీసీ జనార్దనరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం మంత్రి అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్లే సమయంలో ప్రధాన రహదారిలోని ప్రజలు మంత్రి కాన్వాయ్‌ను ఆపి సమస్య విన్నవించారు. వేసవిలో బోర్లు ఎండిపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొద్ది రోజుల నుంచి వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతున్నా ఏమాత్రం సరిపోవడం లేదని వాపోయారు. అధికారులతో మాట్లాడి అదనంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేసి సమస్య లేకుండా చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వరి, మహేశ్వర్‌రెడ్డి, జయంతి దంపతుల ఆధ్వర్యంలో గరుడోత్సవం, కల్యాణోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. సోమవారం పౌర్ణమి రోజున రాతిదూలం పోటీలు, చెక్కభజన, కోలాటం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వల్లంపాడులో 15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడులో ఓ వ్యక్తి నుంచి శనివారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణయ్య గ్రామంలో బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

బేతంచెర్ల: పట్టణంలోని ఆంజనేయ, చెన్నకేశవ, మాధవ, గట్ల నరసింహస్వామి, పాలుట్ల రంగస్వామి దేవాలయాలకు సంబంధించి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఈఓ మద్దిలేటి తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులను నంద్యాల జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయానికి పంపాలని ఈఓ పేర్కొన్నారు. నూతన పాలకమండలి 9లో మంది సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. అందులో ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణ, బ్రహ్మణులతో పాటు మరో 5 మంది ఉంటారు. మహిళలు 5 మంది ఉంటారని వెల్లడించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకకు హాజరైన భక్తులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ఆంజనేయస్వామి

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ హోమాలు, యంత్ర ప్రతిష్ఠ అనంతరం మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు చంద్రశేఖర్, రమేష్, ప్రసాద్, తిరుమలేశ్వర్‌రెడ్డి, హుసేన్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతి చెందిన మహిళ

డోన్ టౌన్: పట్టణంలోని టీచర్స్‌కాలనీ ముల్లావారి వీధిలో శనివారం ఓ మహిళ (45)అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన వన్నూరమ్మ కొద్ది నెలల క్రితం డోన్‌కు వచ్చింది. కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా అద్దె ఇంట్లో ఉంటోంది. మద్యం అలవాటుతో పాటు రైల్వే ఉద్యోగితో సహ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. అయితే శుక్రవారం రాత్రి మిద్దెపై పడుకున్న ఆమెకు ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం ఉదయం ఎంతకూ లేవక పోవడంతో గమనించిన కాలనీవాసులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి పరిశీలించగా మృతిచెందింది. శవాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలతో పాటు రైల్వే ఉద్యోగి గురించి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కమనీయం..పాండురంగడి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



గ్రామోత్సవం

కోవెలకుంట్ల: పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారి కల్యాణ మహోత్సవానికి ముందు ధ్వజపత ఆరాధన, ధ్వజారోహణం, ధ్వజపూజ, బేరిపూజ, సంప్రోక్షణ, హోమం, తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం చిత్తా నక్షత్రం ముత్యాల తలంబ్రాలు, భాజభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను కోవెలకుంట్ల పట్టణంలోని పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. రాత్రి స్వామివారు హనుమద్వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. లలిత తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత ధ్రువ పత్రాలను జతచేయాలన్నారు. కళాశాలలో బీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) బీఎస్ (గణితం, జువాలజీ, కెమిస్ట్రీ) సబ్జెక్టులు ఉన్నట్లు తెలిపారు. వివరాలను కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు సంప్రదించాలని పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

డోన్ టౌన్: అధికారులు, సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధిలో పయనిస్తోందని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. శనివారం అత్యుత్తమ ప్రతిభ చూపిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది శ్రీరాములు, దేవేంద్రుడు, రసూల్, ఎస్‌ఎం వలి, ఐవీఆర్ రెడ్డి, శ్రీరాముడు, చంద్రమోహన్, బాల సుంకన్నలకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.